క్లుప్తంగా

విద్యా కమిషన్ సభ్యుడిని కలిసిన నాయకులు



కల్వకుర్తి రూరల్: రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కల్వకుర్తి మండలం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ప్రాంతంలో నెలకొన్న విద్యకు సంబంధించిన సమస్యలు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్, శివయ్య, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నివాళి

ఊర్కొండ: మండలంలోని బొమ్మరాసిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పెంటయ్య మృతి చెందడంతో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట ద్యాప నిఖిల్‌రెడ్డి, అయూబ్ పాషా, రమేష్ నాయక్, వహిదొద్దీన్, ఆదినారాయణ, మనోహర్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఆరోగ్య కిట్ల పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం గర్భిణులకు ఆరోగ్య కిట్లు పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ వీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ జంగయ్య మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం ఉప్పల వెంకటేష్ నియోజకవర్గ మొత్తం మెడికల్ కిట్లు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, గుమ్మకొండ రాజు, పాండు గౌడ్, రమేష్, నరేష్, గణేష్, పాండురంగారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరి విద్యాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ఆసనాలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమన్నారు. అక్కడికి వచ్చిన విశ్వశాంతి వృద్ధ ఆశ్రమం వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాం మోహన్, మాజీ కౌన్సిలర్ రాముడు, బ్రహ్మకుమారీస్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

తాడూరు: ప్రభుత్వం అమలు చేసిన భూ భారతి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు అయా గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిశాయి. రెవెన్యూ సదస్సుల్లో 892 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జయంతి, డిప్యూటీ తహసీల్దార్ మహమూద్ అలీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మల్లేష్ నాయుడు, సురేందర్‌రెడ్డి, హరి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యం కావడంతో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని వనపట్ల గ్రామానికి చెందిన కాశన్న శుక్రవారం ఆస్పత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి జిల్లా కేంద్రానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫీజులు కట్టడి చేయాలి

తిమ్మాజిపేట: ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు నియంత్రణ చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల భారం తగ్గించేలా చర్యలు తీసుకోవలని ఏబీవీపీ నాయకులు ఎంఈఓకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రం తిమ్మాజిపేటలో శుక్రవారం మండల కన్వీనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎంఈఓ సత్యనారాయణ శెట్టికి వినతి పత్రం అందజేశారు. రామకృష్ణ, శివ, శ్రీశైలం ఎంఈఓను కలిసిన వారిలో ఉన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి మండల నూతన మార్కెట్ చైర్మన్ దండు నర్సింహను కాంగ్రెస్ మండల యువ నాయకులు మద్ది ఇమాన్‌గౌడు, మరికల్ మాజీ సర్పంచ్ కృష్ణవేణి రాములు, హబీబ్, నిరంజన్, నారాయణ, ప ర్వతాలు శుక్రవారం శాలువాతో సన్మానించారు.

బాధితులకు పరామర్శ

చారకొండ: మండలంలోని జూపల్లిలో కడారి వీరయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సత్యహరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ నకినమోని రాములు యాదవ్ పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. సిరాజ్, చాంద్, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు కరువు
- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం



జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో కంపచెట్లతో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కందనూలు: ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. నిబంధనలు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. కంచె ఏర్పాటు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో, రహదారుల వెంట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఆయా దారిలో వెళ్లే ప్రజలు, చిన్నారులు, భయాందోళనకు గురవుతున్నారు. రాబోయేది వర్షాకాలం ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా విద్యుత్ లైన్ విస్తరణ కూడా చేపడుతున్నారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేసే విషయంలో మాత్రం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అదే క్రమంలో ఆ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీపురం మెయిన్‌రోడ్డు, నల్లవెల్లిరోడ్డు, శ్రీనగర్ కాలనీలోని పలు వార్డుల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. వేసవి సెలవులు కావడంతో పిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు బయపడుతున్నారు.

కానరాని కంచె

జిల్లా కేంద్రంలోని నల్లవెల్లిరోడ్డు, శ్రీనగర్‌కాలనీ, శ్రీపురం రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయలేదు. పిల్లలకు సైతం చేతికి అందే ఎత్తులో దర్శనమిస్తున్నాయి. కనీసం ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారం రోజుల్లో కంప చెట్లు తొలగించి, కంచె ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు చేపడుతాం.

– శ్రీధర్ శెట్టి, డీఈ, నాగర్‌కర్నూల్

అధికారులు పట్టించుకోవడం లేదు



పట్టణంలోని పలు కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంప చెట్లు, మరో వైపు తీగ జాతి మొక్కలు అల్లుకుపోవడంతో విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించాలి. కంచె ఏర్పాటు చేయాలి.

– పసుపుల లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్, శ్రీనగర్ కాలనీ

వర్షాలకు ఎర్త్ వచ్చే అవకాశం



రోడ్డు వెంట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్త్‌పైపులు వర్షం నీటిలో మునిగి వాహనాలకు తగిలితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరగకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలి. పిల్లలను బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు.

– పరమేశ్వర్, టైలర్, శ్రీపురం రోడ్, నాగర్‌కర్నూల్

రెవెన్యూ సదస్సులు వందశాతం పూర్తి

- కలెక్టర్ బదావత్ సంతోష్



రైతులతో భూమి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు 100శాతం పూర్తయిందని, ఆగస్టు 15వ తేదీ నాటికి భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెల్గొండ గ్రామంలో తహసీల్దారు ఎండీ మునీరుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగకుండా తహసీల్దారు నేతృత్వంలోని బృందాలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్ని వెంటనే సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అల్లీపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో అన్నారు. వెల్గొండలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన పిల్లల పెరుగుదల, అభివృద్ధికి సంబంధించిన పలు వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు, ఆహార సరఫరా, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. బిజినపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ రిజిస్టర్, మందుల స్టాకును పరిశీలించారు. బిజినపల్లి పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, వైద్యులు, నర్సుల వివరాలు తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శివకుమార్ ఉన్నారు.

నెలాఖరు వరకు మూడు నెలల రేషన్ బియ్యం

వర్షాకాలం నేపథ్యంలో రవాణా, ఇతర ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం ఒకే సారి పంపిణీ చేస్తుందని, ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటికే 66శాతం వరకు బియ్యం పంపిణీ పూర్తి అయిందని, 2,43,720 రేషన్ కార్డులకు గాను 1,60,351 రేషన్‌కార్డు లబ్ధిదారులు బియ్యం అందుకున్నట్లు తెలిపారు. మండలంలోని వెల్గొండ గ్రామంలోని 16వ నెంబర్ రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీని పరిశీలించారు. ఇంకా బియ్యం అందుకొని లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద ఈ నెలాఖరు వరకు అందుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దారు ఎండీ మునీరుద్దీన్, గ్రామ నాయకులు చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



భూమి పూజ కార్యక్రమంలో అధికారులు, నాయకులు



అగ్రహారం తండాలో నిర్మాణాలకు మార్క్ చేస్తున్న అధికారులు

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మార్చాలలో మంజూరైన 29 ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట రాములు, కార్యదర్శి రమేష్, ఎల్లమ్మ, ఆంజనేయులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించాలి

వెల్దండ: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్రిగుంతతండా, కేస్లీతండాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ వేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పల్లవి, నాయకులు పుల్‌సింగ్, చందర్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగం పెంచాలి

తాడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 550 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీఓ నర్సింహులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

చారకొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మండలంలోని మర్రిపల్లి, అగ్రహారం తండా, జూపల్లి గ్రామాల్లో ఏఈ సురేష్, మార్కు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నరేష్ నాయక్, ప్రశాంత్ నాయక్, కార్యదర్శులు ఉన్నారు.

తిమ్మాజిపేట: అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని ఎంపీడీఓ లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని గొరిట గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, పోలీసులు ప్రజల సమక్షంలో సమావేశం నిర్వహించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నాగర్‌కర్నూల్‌లో దివ్యాంగులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు



కల్వకుర్తిలో నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

నాగర్‌కర్నూల్ రూరల్: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా యూనియన్ మాజీ నేత కామ్రేడ్ తారకానాథ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సర్వోదయ వికలాంగుల ఆశ్రమంలో బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మాజీ నేత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐతోల్, తెలకపల్లి, బిజినపల్లి ఉయ్యాలవాడ, మంగనూర్, వట్టెం శాఖల లోకల్ సెక్రటరీ, స్టాఫ్, మురళీధర్, సర్వోదయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తారకానాథ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ వ్యవస్థాపకుడు వై తారక్ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్బీఐ స్టాఫ్ యూనియన్ కల్వకుర్తి కార్యదర్శి పరశురాం, వేదావతి, రాజు, కార్తీక్, సతీష్, కిరణ్, నరేష్ ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య, పద్మ, పరమేష్ వృద్ధులు పాల్గొన్నారు.

5న మెగా కంటి వైద్య శిబిరం



పోస్టర్ విడుదల చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కల్వకుర్తి రూరల్: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 5న నిర్వహించే మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం కోసం మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం పోస్టర్లు విడుదల చేశారు. మండలంలోని మార్చాలా, జిల్లెల్ల, పంజుగుల, ముకురాల, లింగసానిపల్లి, గుండూరు, రఘుపతిపేట గ్రామాలలో ఫౌండేషన్ సభ్యులు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుపేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కలిపించే లక్ష్యంతో ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్ ఆవరణలో 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు శిబిరం నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీసు బాలరాజు, వెంకయ్య, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవి, మాలిక్, మహేందర్, రమేష్, వినోద్ రెడ్డి, తిరుపతి రెడ్డి, యూసుఫ్ బాబా, గణేష్, శ్రీపతి, శేఖర్, శ్రీను, ఝాన్సీరాణి ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



అచ్చంపేట మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

అచ్చంపేట: అచ్చంపేటలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలల దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షులు శివ చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్చంపేట మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న దుకాణాల వల్ల ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోవడమే కాకుండా, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అధిక ధరలకు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. అక్రమ విక్రయాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందులాల్ చౌహాన్, అమర్, చైతన్య చారి, అజయ్, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖపై విద్యార్థులకు అవగాహన



బల్మూర్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో శుక్రవారం పోలీస్ స్టేషన్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజేందర్ విద్యార్థులకు పోలీసుశాఖ విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. పోలీసులు ప్రజలకు ఏవిధంగా సహాయ పడుతున్నారు, నేర విచారణలో పోలీసుల పాత్ర, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందన, పోలీస్ రికార్డుల నిర్వహణ, సీసీ టీవీ, సైబర్‌క్రైమ్ కమ్యూనిటీ అవేర్‌నెస్ వంటి అంశాలపై ఎస్‌ఐ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పోలీసుస్టేషన్ పరిసరాలు, రికార్డుల గది, లాకప్ రూమ్‌లను చూపించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కార్యక్రమాన్ని చేపట్టి వారి ఖాతాలలో నిధులు జమ చేసిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, రైతు భరోసా పడిన అకౌంట్లను హోల్డ్‌లో పెట్టకూడదని శుక్రవారం ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు, శ్రీధర్ రెడ్డి, జంగయ్య, పాండు, పవన్ తదితరులు ఉన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు అంటూ కోర్టు ఉత్తర్వుల మేరకు ఇళ్లు తొలగించిన బాధితులకు ప్రభుత్వం నుంచి న్యాయం చేస్తామని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాల్‌రాంగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ భూముల్లో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఇళ్లను తొలగించారని, ఇళ్లు కోల్పోయిన వారికి ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు మంజూరుకు కృషి చేసి న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, సిర్సనగండ్ల మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, వెంకటయ్య ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తెలకపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏఎన్‌ఎం అలివేల, హెల్త్‌అసిస్టెంట్ సందిప్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సమస్యలను గుర్తించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భారతమ్మ, పుష్ప, జి పుష్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మెన్‌పేటలో వైద్య శిబిరం



బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలో శుక్రవారం బల్మూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు సమగ్ర వ్యాధి నిర్ధారణ ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 95 మంది రోగులకు సాధారణ పరీక్షలతో పాటు రక్తపోటు, రక్త పరీక్షలు, మధుమేహం, టీబీ, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ కల్పన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఆరోగ్య పరిస్థితి సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ ఆరీఫ్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రమేష్, సీహెచ్‌ఓ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల, చారకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జానకిరాం నాయక్ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ప్రకటనలో తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనుల పరిశీలన ఎంపీడీఓ కృష్ణయ్య

ఊర్కొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ కృష్ణయ్య శుక్రవారం పరిశీలించారు. మండలంలోని జకినాలపల్లి గ్రామంలో ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కౌట్ చేశారు. నర్సరీని సందర్శించి వర్షాకాలం నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన నర్సంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. పర్యవేక్షించిన వారిలో ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, హౌసింగ్ ఏఈ తరుణ్, ఏపీఓ నరసింహ, కార్యదర్శులు ఉన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం సహకరించాలి



తీగలపల్లిలో ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న సీపీఎం బృందం సభ్యులు

కోడేరు: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సహకరించి జాతీయ హోదా కల్పించాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉజు కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తీగలపల్లిలో జరుగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణానికి కేటాయించిన నిధులు రెట్టింపు అయ్యాయి తప్పా పనులు మాత్రం సగం కూడా పూర్తి కాలేదని విమర్శించారు. 2025 రాష్ట్ర బడ్జెట్‌లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.2వేల కోట్లు కేటాయించి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశిస్తే ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. కేటాయించిన నిధులు పెండింగ్‌లో ఉన్న బకాయిలకే సరిపోతుందని మండిపడ్డారు. తీగలపల్లి రిజర్వాయర్‌లో పంపింగ్ చేయడానికి పది మోటార్లు ఉన్నాయని 138వేల ఆర్స్ పవర్ సామర్థ్యం కలిగి ఉందన్నారు. సర్జిపుల్ సమాంతర భూమికి 90 మీటర్ల లోతు ఉందని, పైన మైదాన ప్రాంతం 100 మీటర్ల పైభాగం ఉంటుందన్నారు. ఇప్పటికైనా రాష్ట ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి సాగర్, ప్రసాద్‌రావు, జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, కందికొండ గీత, దేశ్‌నాయక్, ఆంజనేయులు, నర్సింహ, శివవర్మ పాల్గొన్నారు.

12ఏళ్లకు పునఃప్రారంభం



చారకొండ: మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలో నెమలిగుట్ట తండాలో 12 సంవత్సరాలుగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల లేరని మూతబడింది. పాఠశాలను ప్రారంభించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినా పట్టించుకోలేదు. మూతపడిన పాఠశాల ప్రారంభించాలని విద్యాకమిషన్ చైర్మన్ ఆ కూనూరి మురళి, విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్‌ను కలిసి కోరారు. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఎంఈఓ ఝాన్సీరాణి తండాల్లో పాఠశాలను ప్రారంభించి, విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభించారు. తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఏఈఓ లేక రైతుల ఇబ్బందులు

తెలకపల్లి: రైతులు నూతనంగా పాసుపుస్తకాలు వచ్చిన, రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవడానికి 20న చివరి తేదీ ఉన్నందువల్ల రైతులందరు రైతు వేదికల వద్ద గ్రామాల్లోని రైతులందరు వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర దరఖాస్తు చేసుకుంటున్నారు. తెలకపల్లిలో ఏఈఓ అందుబాటులో లేకపోవడం రైతులు ఇబ్బందులు పడ్డారు. దాసుపల్లి రైతు వేదిక కింద తెలకపల్లి, కమ్మరెడ్డిపల్లి, రాంరెడ్డిపల్లి గ్రామాలకు సంబంధించిన రైతులందరు దరఖాస్తు చేసుకోవాలి. చాలా మంది రైతులు రైతు వేదిక వద్ద ఏఈఓ లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడ్డారు. దరఖాస్తు చివరిరోజు కావడం వల్ల ఏఈఓ అనారోగ్యం ఉందని కార్యాలయంలో చెప్పకుండా ఆస్పత్రికి వెళ్లినట్లు సమాచారం, దీంతో రైతులు దరఖాస్తులు ఎవరి ఇవ్వాలో తెలియక తీవ్ర ఆందోళన చెందారు. చాల మంది రైతులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. ఈ ఏఈఓపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.